

## పటిష్టమైన రక్షణ చర్యలు అవసరం

ప్రభుత్వాలు ఆస్పత్రుల్లో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలి. సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రుల గేట్ల వద్ద మాత్రమే కాకుండా లోపల బ్లాకుల్లో నిరంతరం తిరిగేటట్లు నిబంధనలు అమలు చేస్తే రక్షణగా ఉంటుంది. ఆస్పత్రుల్లో వైద్యులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి. సెక్యూరిటీతోపాటు సీసీ కెమెరాల సంఖ్య పెంచాలి. రాత్రిళ్లు గస్తీలో ఉన్న పోలీసులు అందుబాటులో ఉన్న ఆస్పత్రుల వద్ద బీట్ నిర్వహిస్తే మరింత రక్షణ కలుగుతుంది.

– డాక్టర్ పృథ్వీరాజ్, కార్డియాలజిస్ట్, శ్రీ హెల్త్‌కేర్ క్లినిక్



## పోలీసులు అందుబాటులో ఉండాలి

అత్యవసర కేసులకు వైద్య సేవలు అందించినప్పుడు ఆస్పత్రుల్లో పోలీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దాడి చాలా హేయమైనది. భవిష్యత్‌లో వైద్యులపై అలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం ముందు జాగ్రత చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో గొడవలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బంది ఓపీ, ఇన్ పేషెంట్ల వార్డుల్లో అందుబాటులో ఉండాలి.

– సుజాత, స్టాఫ్ నర్స్, ఈఎన్‌టీ హాస్పిటల్



## క్లుప్తంగా

### మాజీ ప్రిన్సిపాల్ భగవాన్ మృతికి సంతాపం



కెప్టెన్ ఎం.టి. భగవాన్(ఫైల్)

ఎంవీపీకాలనీ: ఎస్‌వీఎల్ ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎంటీ భగవాన్ బుధవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. పలువురు ప్రముఖులు ఆయని నివాసానికి చేరుకుని సంతాపం తెలిపారు. భగవాన్ మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో లెక్చరర్‌గా 20 ఏళ్లు సేవలందించారు. అనంతరం పాడేరు, సాలూరు డిగ్రీ కళాశాల్లో సుదీర్ఘకాలం పనిచేశారు. భీమిలి డిగ్రీ కళాశాలతో పాటు పలు కాలేజీల్లో ప్రిన్సిపాల్‌గా సేవలందించి పదవీ విరమణ చేశారు. భగవాన్ విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నతంగా స్థిరపడ్డారు. బుధవారం సాయంత్రం ఆయని పార్థివ దేహాన్ని మెడికల్ రీసెర్చ్ కోసం కుటుంబ సభ్యులు అప్పగించారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, కృష్ణ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు గుండు వెంకటేష్ పట్నాల, నాగవెంకట రామ్మోహన్‌రెడ్డి సింగూరు, నర్సింగరావు, భూపతి సత్యనారాయణరాజు, మోహన్‌కుమార్, రమేష్ శర్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ఏయూ డీన్ కృష్ణకు అభినందనలు



డీన్ కృష్ణను అభినందిస్తున్న విశాఖ మాదిగ సంఘం నాయకులు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా నియమితుడైన ఆచార్య టి.వి.కృష్ణకు విశాఖ మాదిగ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. నాయకులు కొప్పుల వెంకటరావు, గోటువాడ నరసింగరావు, పెద్దాడ చలపతి డాక్టర్ ఆశాకిరణ్, మాదిగ ఉద్యోగులు సంఘం నాయకులు అత్తోట రవికుమార్, గంట్యాడ చలం, సంపూర్ణం దానమయ్య డీన్‌కు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–1, సెక్టార్–2 కొత్త వెంకోజీపాలెం చుట్టుపక్కల ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ బి.సింహాచలం నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

### ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారుల ఉదారత



కేశవరావు భార్యకు ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) క్యాంపస్ కార్యాలయ ఉద్యోగిగా పనిచేస్తూ ఆకస్మికంగా మరణించిన వి.కేశవరావు కుటుంబానికి ప్రోగ్రాం అధికారులు ఆర్థిక సాయం అందించి తమ ఉదారత చాటారు. ఏయూలోని విశాఖ, విజయనగరం, ఉభయ గోదావరి జిల్లాల ప్రోగ్రాం అధికారులు తమ వంతు సాయంగా రూ.3.07 లక్షలు సేకరించి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు చేతుల మీదుగా కేశవరావు భార్య అనూషకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్, విశాఖ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, ఇతర ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

# గెడ్డలు ఘోరం

- పెద్ద ఎత్తున పేరుకుపోయిన పూడికలు
- మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం
- దోమలు, ఈగలతో సహవాసం
- 16వ వార్డు వాసుల్లో ఆందోళన



రజక వీధి గెడ్డలో పూడికలు



అంబేడ్కర్ కాలనీ గెడ్డలో చెత్తాచెదారం

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులోని గెడ్డలు ఘోరంగా తయారయ్యాయి. వర్షాలు కురుస్తున్న సమయంలో గెడ్డల్లో పూడికలు తీయకపోవడంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. పగటి వేళల్లో ఈగలతో, సాయంత్రం వేళల్లో దోమలతో గెడ్డ ప్రవాహిక ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

**ఎక్కడికక్కడ నిల్వ**

వార్డులోని కేఆర్ఎం కాలనీ నుంచి ఇసుకతోట వరకు గల గెడ్డ పూడికలతో నిండిపోయింది. ఎప్పటికప్పుడు పూడికలు తీయకపోవడంతో మురుగునీటి ప్రవాహం ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఈ గెడ్డ ఆధునికీకరణకు కోట్లాది రూపాయిల వెచ్చించారు. గెడ్డ అడుగు భాగమంతా కాంక్రీట్ వేశారు. నీటి ప్రవాహానికి ఎక్కడా ఆటంకం లేకుండా నిర్మించారు. సకాలంలో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించాల్సిన జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గెడ్డ పూడికల మయమైంది.

**వ్యాధుల భయం**

ఇసుకతోట రజక వీధి మీదుగా అంబేడ్కర్ కాలనీ నుంచి ఇసుకతోట ప్రధాన రహదారి వరకూ ప్రవహించే గెడ్డ చెత్తచెదారంతో నిండిపోయింది. ఇటీవలే రజక వీధిలో రెండు లారీల చెత్త తొలగించారు. ఇంకా టన్నుల కొద్ది పూడికలు పేరుకుపోయి ఉన్నాయి. దీంతో అంబేడ్కర్ కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోజూ ఈగలు, దోమల దాడులతో సతమతమవుతున్నారు. గెడ్డ పక్కన నివాసాలుండటంతో వ్యాధులు ప్రబలుతాయోనని భయపడుతున్నారు.

**సకాలంలో పూడిక తీయాలి**

వర్షా కాలం నేపథ్యంలో గెడ్డలు, కాలువల్లో సకాలంలో పూడికలు తొలగించాల్సి ఉంది. వర్షాలు భారీగా కురుస్తున్నా.. పూడికలు సక్రమంగా తీయడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో భారీ వర్షానికి మురుగు నీరు పొంగిపొర్లుతోంది. చెత్తాచెదారం అంతా రహదారులపైకి కొట్టుకొస్తోంది. జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది స్పందించి సకాలంలో పూడికలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎన్నాళ్లీ మురుగు సమస్య..?

- పార్వతీనగర్ రోడ్డుపై వాడుక నీరు నిల్వ
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



పార్వతీనగర్‌లో రోడ్డుపై చేరిన మురుగు నీరు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పార్వతీనగర్‌లో రోడ్డుపై మురుగు నీటి సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి సమస్య ఉన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ రోడ్డు దాటడానికి పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఇది ప్రధాన రహదారి కావడంతో ఇక్కడ నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇటీవల పార్వతీనగర్, సూర్యతేజానగర్ మధ్యలో గెడ్డపై ఉండే ఇరుకైన బ్రిడ్జిని తొలగించి దాని స్థానంలో 60 నుంచి 80 అడుగుల వెడల్పుతో రెండు విశాలమైన బ్రిడ్జి నిర్మించారు. వాటిపై అద్దంలా మెరిసే తారు రోడ్డు వేశారు. ప్రస్తుతం ఆ రహదారిని ఆనుకుని ఉన్న కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. ఇక్కడ కాలువలో చెత్త పేరుకుపోవడంతో వాడుక నీరు కిందకు పోవడానికి వీలు లేకుండా మూసుకుపోయింది. దీంతో కాలనీవాసుల వాడుక నీరు ఇక్కడ నిల్వ ఉండిపోతోంది. ఆ మురుగు రోడ్డు మీదకు చేరి ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు పూర్తిగా గోతులు పడింది. ఆ గోతుల్లో నిల్వ ఉన్న నీటిని దాటుకుంటూ పాదచారులు, వాహన చోదకులు ప్రయాణించాల్సి వస్తోంది. అక్కడ నిల్వ ఉన్న మురుగు నుంచి వచ్చే దుర్వాసనకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.

# విద్యా రంగంలో శిఖరాగ్రాన ఏయూ

జీబీఏ-ఎంబీఏ తరగతుల ప్రారంభోత్సవంలో రిజిస్ట్రార్ ధనుంజయరావు



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు స్వాగతం పలుకుతున్న సిబ్ ప్రొఫెసర్లు

విశాఖ సిటీ: విద్యా రంగంలో శిఖరాగ్రాన ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బుధవారం నూతన విద్యా సంవత్సరం బీబీఏ–ఎంబీఏ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూ శతాబ్ది జరుపుకోవడానికి సిద్ధమవుతోందన్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మక వర్సిటీని ఎంపిక చేసుకున్న ప్రతి విద్యార్థికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థుల ఆసక్తిని గుర్తించి తదనుగుణంగా ప్రోత్సహించడం ఎంతో ప్రధానమని పేర్కొన్నారు. ఏయూ సిబ్‌లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచే దిశగా కృషి చేస్తామని తెలిపారు. కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ అత్యుత్తమ ప్రమాణాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. నూతన బ్యాచ్ విద్యార్థులకు ఏయూ సిబ్స్‌పై అవగాహన కల్పించారు. ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వ్యవస్థను ఏయూ కలిగి ఉందన్నారు. ఇంటర్న్‌షిప్‌లు, ఇంక్యుబేషన్ కేంద్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏయూ అలుమ్ని అసోసియేషన్ చైర్మన్ ఆచార్య ఇ.శంకరరావు, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, మోహన్‌గణేష్, బి.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన



వర్షపు నీటితో నిండిన కేఆర్ఎం కాలనీ



కేఆర్ఎం కాలనీలో వాన నీటి ప్రవాహం

మద్దిలపాలెం: నగరంలో బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి మద్దిలపాలెం తడిసిముద్దయింది. ప్రధాన రహదారులపై వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాలపై గొడుగులు పెట్టుకుని సాహసోపేతంగా రాకపోకలు సాగించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవన స్తంభించింది. రహదారులు జలమయమయ్యాయి. కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెం రోడ్డు, మంగాపురం కాలనీ, పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. కాలువల్లోని వ్యర్థాలు రోడ్లపైకి చేరాయి.

**నీట మునిగిన కేఆర్ఎం కాలనీ**

దంచికొట్టిన వర్షంతో 16వ వార్డు కేఆర్ఎం కాలనీ నీట మునిగింది. కాలనీ మీదుగా ప్రవహించే పెద్ద గెడ్డ నీటి ప్రవాహంతో పొంగిపొర్లింది. లోతట్టు ప్రాంతాల్లో ఒకటైన కేఆర్ఎం కాలనీ మోకాల లోతు నీటితో నిండిపోయింది. కాలనీలోని ఇళ్లలో వర్షపు నీరు చేరింది. రాకపోకలు సాగించడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. కాలనీలో పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాలు కొన్ని వర్షపు నీటి ప్రవాహ దాటికి పడిపోయాయి. గంటపాటు కురిసిన భారీ వర్షంతో ఇలా మునిగిపోయిందని కాలనీవాసులు పేర్కొన్నారు. మరికాసేపు కురిస్తే పరిస్థితి మరోలా ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. జోరువానకు జనం ఇళ్లకు పరిమితమయ్యారు.

## మిజోరం గవర్నర్‌ను కలిసిన నాయకులు



మిజోరం గవర్నర్ హరిబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబును బుధవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, నగర అధ్యక్షుడు ఎం.రవీంద్రరెడ్డి, నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు తదితరులు ఆయనకు జ్ఞాపిక అందజేశారు. ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ వాయునందనరావు, కృష్ణ తదితరులు శ్రీరామచంద్రమూర్తి చిత్రపటాన్ని హరిబాబుకు బహూకరించారు. ఆయనతో నాయకులు కొంత సేపు ముచ్చటించి, స్థానిక పరిస్థితులపై చర్చించారు.

## వెలమలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఆరిలోవ: వెలమ సామాజిక వర్గానికి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర వెలమ సామాజిక వర్గం అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన వెలమ సామాజిక వర్గం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా వెలమ సామాజిక వర్గం ప్రజలు ఉన్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వీరిని బీసీ 'ఏ'లోకి మార్చాలని డిమాండ్ చేశారు. వెలమ రైతులకు 100 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పించాలని కోరారు. తాటిపూడి రిజర్వాయర్‌కు ప్రస్తుతం ఉన్న గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అదనపు కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, వైస్ ప్రెసిడెంట్ వరుదురాజ్, పాల్గొన్నారు.

## ప్రజా రవాణా ఉద్యోగుల టీఏ పునరుద్ధరించాలి



జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు ఈ నెల నుంచి నిలిపివేసిన టీఏ అలవెన్స్‌ను పునరుద్ధరించి, ఎరియర్స్, ఇతర అలవెన్స్‌లు సకాలంలో చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌లో జాయింట్ డైరెక్టర్ పూజారి శ్రీనివాస్ నాయక్‌కు వినతి పత్రం అందించామని తెలిపారు. ఏపీపీటీడీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన అలవెన్స్‌లను అకస్మాత్తుగా నిలిపివేయడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యామని ఆయన పేర్కొన్నారు. రాత్రనకా, పగలనకా 8 నుంచి 16 గంటల పాటు ప్రయాణికులకు సేవలందిస్తున్న ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు అలవెన్స్‌లు కొరత పెట్టి ఇబ్బందులకు గురిచేయడం భావ్యంగా లేదన్నారు. విజయనగరం జోన్ అధ్యక్ష్య కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, ఎం.వి.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశవాణిలో నేత్రదానంపై అవగాహన



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న కంటి వైద్య నిపుణురాలు ప్రీతి

ఆరిలోవ: అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ పాతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ఆల్ ఇండియా రేడియో(ఆకాశవాణి)లో 39వ జాతీయ నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో కార్నియా కన్సల్టెంట్ డాక్టర్ మోహన్ ప్రీతి ఆకాశవాణి కేంద్రంలో మాట్లాడారు. ఏవిధంగా నేత్ర దానం చేయాలి, ఎవరికి చేయాలి, నేత్రదానం ఎవరు చేయవచ్చు తదితర విషయాల గురించి ఆకాశవాణితో ద్వారా శ్రోతలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రతినిధి దిలీప్ నేత్రదానంపై ప్రజల నుంచి వచ్చే సందేహాలను డాక్టర్ ప్రీతి ద్వారా తెలుసుకుని వెల్లడించారు. ఇది రేడియోలో శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఆరోగ్యమే మహా భాగ్యం కార్యక్రమంలో ప్రసారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని శ్రోతులు విని అవగాహన పెంచుకోవాలని సూచించారు.

# అబ్బురపరిచిన భక్తప్రహ్లాద నాటకం



భక్తప్రహ్లాద నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 38వ వార్షికోత్సవంలో భాగంగా కళాభారతి వేదికగా ఐదో రోజు ప్రదర్శించిన భక్తప్రహ్లాద నృత్య రూపకం అందరినీ అబ్బురపరిచింది. డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి రూపకల్పనలో ఆయనే హిరణ్యాక్షుడిగా నటించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ప్రహ్లాదుడిగా నిఖిత అద్భుతంగా నృత్యం చేసి అందరినీ ఆకట్టుకుంది. నాటకంలో ప్రతి ఘట్టాన్ని కూచిపూడి నృత్య రీతులతో రక్తికట్టించారు. ముఖ్య అతిథి రాగం కిషోర్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, వేదాంతం రామలింగేశ్వరశాస్త్రిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# మొక్కల పెంపకం, సంరక్షణకు చర్యలు



మొక్కలు నాటే ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో మొక్కలు నాటే ప్రాంతాన్ని బుధవారం వీసీ జి.శశిభూషణరావు పరిశీలించారు. ఈ ప్రాంగణం చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కలకు అవసరమైన నీటిని అందించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, తదితర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వీసీ వెంట ఆచార్య ఎన్.ఎం.యుగంధర్ తదితరులు ఉన్నారు.

## నేడు తెలుగు భాషా దినోత్సవం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వారాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 6.30 గంటలకు సాహితీ గోష్ఠి జరుగుతుందని చెప్పారు.

# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

- తొలగించాలని కోరుతున్న ఇందిరానగర్‌వాసులు



ఇందిరానగర్ ప్రధాన రహదారి మధ్యలో తుప్పు పట్టిన ఇనుప విద్యుత్ స్తంభం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ప్రధాన రహదారి మధ్యలో వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఇనుప విద్యుత్ స్తంభం నిలిచింది. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఈ స్తంభం తుప్పు పట్టిపోయి ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్ల క్రితం ఈ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించిన సమయంలో వీధిలైట్లు వేశారు. ఆ స్తంభాలు ఇప్పుడు తుప్పు పట్టిపోయాయి. ఎప్పుడు ఎటువైపు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇనుప స్తంభం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితికి చేరింది. ఇది రోడ్డు మధ్యలో ఉండటంతో వాహన రాకపోకలకు ఆటంకంగా మారింది. రహదారి ఇరుగ్గా మారింది. ఈ స్తంభాన్ని తొలగిస్తే రోడ్డు వెడల్పు అవుతుందని, వాహనాల రాకపోకలకు ఇబ్బంది తొలగిపోతుందని స్థానికులు భావిస్తున్నారు. విద్యుత్ విభాగం అధికారులు పరిశీలించి ఈ స్తంభాన్ని రోడ్డు మధ్య నుంచి తొలగించి, కాలువ పక్కన కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## రిజిస్ట్రార్‌కు విదేశీ విద్యార్థుల శుభాకాంక్షలు



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విదేశీ విద్యార్థులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావును బుధవారం విదేశీ విద్యార్థులు కలిసి అభినందించారు. గతంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా సేవలందించి రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందడంతో విద్యార్థులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు రిజిస్ట్రార్ ధనుంజయరావును అభినందించారు. పలువురు వర్సిటీ అధికారులు, ఉద్యోగులు, ఏయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ రిజిస్ట్రార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం

సీతంపేట: పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. రాజనీతి, పరిపాలనా శాస్త్రం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రాటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంటబిలిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో «ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల పాలన, ఎన్‌డీఏ ప్రభుత్వానికి సవాళ్లు» అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. నైపుణ్య గణన చేయాలన్న ప్రభుత్వం నిర్ణయంతో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో సెమినార్ కన్వీనర్ ఆచార్య పి.ప్రేమానందం, కో కన్వీనర్ తాడ్డి నాగరాజు, కె.సత్యనారాయణ, వి.హరిబాబు, కె.రత్నరాజు, ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.